క్లుప్తంగా

శిరివెళ్ల సీఐగా చంద్రబాబు



శిరివెళ్ల: పోలీస్ సర్కిల్ నూతన సీఐగా చంద్రబాబు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పని చేసిన వంశీధర్ నంద్యాల ఫ్యాక్షన్ జోన్‌కు బదిలీ కావడంతో ఈ నియామకం జరిగింది. కాగా నూతన సీఐ వైఎస్సార్ జిల్లా రాయచోటి సీసీఎస్ నుంచి బదిలీపై వచ్చారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



శిరివెళ్లలో పునర్నిర్మించిన శ్రీ బసవేశ్వరస్వామి ఆలయం

శిరివెళ్ల: మండల కేంద్రం శిరివెళ్లలో ఈ నెల 20వ తేదీ నుంచి పునర్నిర్మించిన శ్రీ బసవేశ్వర స్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయంలో శ్రీ వరసిద్ధి వినాయక, అన్నపూర్ణ విశాలక్ష్మీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, బసవేశ్వరస్వామి, కుమార, వీరభద్ర, కాల భైరవ, నవగ్రహాలు, నాగ, ధ్వజ ప్రతిష్ఠ జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 20న గోపూజ, గణపతి పూజ, రుద్ర, వీర భద్ర, నవగ్రహ, వాస్తు హోమాలు చేపడతారు. 21న విగ్రహాలకు అభిషేకాలు, పుష్పాధివాసం. 22న విగ్రహాల ప్రతిష్ఠ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయి.

కార్మికుల శ్రేయస్సుకు కృషి

నంద్యాల(సిటీ): పారిశుద్ధ్య కార్మికుల శ్రేయస్సుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ స్టేట్ కో ఆర్డినేటర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం (నమస్తే) స్కీం పైలట్ ప్రాజెక్ట్‌ను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిర్వహిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయడం, మురుగు తొలగింపు తదితర పనులు చేసే కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఎన్ఎస్ఎఫ్‌డీసీ ద్వారా రుణ సదుపాయం ద్వారా ఉపాధి కల్పిస్తుందని చెప్పారు. శానిటరీ సూపర్ వైజర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



నంద్యాలలో ప్రథమనందీశ్వరుడికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శైవ లయాల్లో మాఘమాసాన్ని పురస్కరించుకొని రెండవ సోమవారం అభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకాలు నిర్వహించారు. ప్రథమనంది, భీమలింగేశ్వర, శ్రీకాశికాంబ చంద్రశేఖర స్వామి, సోమనందీశ్వర , బ్రహ్మనందీశ్వర, మల్లికార్జునస్వామి, నాగుల కుంట నాగలింగేశ్వర ఆలయాల్లో ఉదయాన్నే స్వామి వార్లకు పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు, నమకం, చమకం పూజల అనంతరం స్వామి వార్లను నాగాభరణంతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మరాఠా సంఘం సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మరాఠీ వీధిలో మరాఠ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఛత్రపతి శివాజీ 394వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు నాగరాజారావు, నాయకులు చంద్రమౌళీశ్వరరావు, నరసింహారావు, నాగరాజరావు, నర్సోజీ, విష్ణుచంద్రారావు, వెంకటరమణ పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక బసవన్న కట్ట రామాలయం వద్ద సోమవారం వినాయక నగర్‌కు చెందిన ఆవుల నరసింహ ప్రతాప్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి, పాలాభిషేకం చేశారు. అనంతరం శివాజీ హిందూ ధర్మం కోసం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దొడ్ల ప్రవీణ్, డీఎం.షరీఫ్, నవీన్, సురేంద్ర, శ్రీకాంత్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వంట తంటాలకు చెల్లు

- మధ్యాహ్న భోజనానికి నాణ్యమైన వంట పాత్రలు
- మండలంలో 31 పాఠశాలలకు పాత్రల పంపిణీ
- ఆరు కేటగిరీలుగా పాఠశాలల విభజన
- వంట సిబ్బందికి తీరిన ఇబ్బందులు

విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం కేవలం విద్యార్థులు, ఉపాధ్యాయులకు సంబంధించినవే కాకుండా మధ్యాహ్న భోజనం వండే వారి అవస్థలను కూడా తొలగించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పదార్థాలు వండటానికి అవసరమైన పాత్రలు అందజేయాలని, ఇందుకు బడులను ఆరు విభాగాలుగా విభజించి పెద్ద పాత్రల నుంచి చిన్న గరిటె వరకు నాణ్యమైన సామగ్రిని అందజేయడంతో వంట సిబ్బందికి పాత్రల సమస్య తప్పింది.

గోస్పాడు: విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. అయితే భోజనం వండేందుకు నిర్వాహకులు తమ వద్దనున్న పాత్రలతో, కొన్ని చోట్ల బాడుగకు తెచ్చి వండుతున్నారు. దీంతో వారికి అవస్థలు తప్పడం లేదు. సమస్యను గుర్తించిన ప్రభుత్వం వంట పాత్రలను అందజేసింది. స్టీల్ డబరాలు, బేసిన్లు, గరిటెలు వంటి నాణ్యమైన పాత్రలను పంపిణీ చేసింది. మండలంలోని 31 పాఠశాలను ఆరు కేటగిరీలుగా విభజించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అందజేశారు. జగనన్న గోరుముద్ద కింద పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కింద ఇప్పటికే రాగి జావను విద్యార్థులకు అందిస్తుండటంతో సౌకర్యార్థం స్టీల్ గ్లాసులను కూడా వీటిలో చేర్చారు.

నిర్వాహకులకు తీరిన ఇక్కట్లు..

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే ఏజెన్సీలకు 2010లో వంట పాత్రలను అందజేశారు. అప్పటినుంచి వాటిని ఉపయోగిస్తున్నారు. కాలక్రమేణా అవి పాడైపోయినా.. తప్పని పరిస్థితుల్లో వాటిలో వంటలు చేసేందుకు మహిళలు అవస్థలు పడాల్సి వచ్చేది. చాలా చోట్ల పాత్రలు దెబ్బతిని వంట చేసేందుకు పనికి రాకుండా పోవడంతో సొంతంగా కొనుగోలు చేసి వంట చేస్తున్నారు. పాత్రలు లేక ఇబ్బందిగా ఉందని ఏజెన్సీల మహిళలు ఎన్ని విజ్ఞప్తులు చేసినా గత పాలకులు పట్టించుకోలేదు.ప్రభుత్వాలు మారుతున్నా వీరి విజ్ఞప్తులు మాత్రం మారలేదు. ఎవరూ పరిష్కారం చూపలేదు. చివరకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం, సమస్య సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో నాణ్యమై, త్వరగా పాడైపోకుండా ఉండేలా పాత్రలు అందజేయాలని ఆదేశించారు.



గోస్పాడు హైస్కూల్‌కు వంట నిర్వాహకులకు పాత్రలు అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

6 కేటగిరీలుగా పాఠశాలలు...

విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాటశాలలను 6 కేటగిరీలుగా విభజించారు. విద్యార్థుల సంఖ్య 30 లోపు ఉండే 12 పాఠశాలలను ఏ కేటగిరీగా, 31-50 వరకు ఉండే 4 పాఠశాలలను బీ కేటగిరిలో, 51- 150 వరకు ఉండే 8 పాఠశాలలను సీ కేటగిరి, 151- 250 వరకు 3 పాఠశాలలను డీ కేటగిరి, 251- 400 వరకు ఈ కేటగిరి కింద ఏమీలేకపోగ, 400 అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉండే 4 పాఠశాలలను ఎఫ్ కేటగిరీగా విభజించారు. అందులో ఏ, బీ కేటగిరీలకు 5, సీ, డీ, ఈ కేటగిరీలకు 6, ఈ, ఎఫ్ కేటగిరీలకు 11 చొప్పున వంట సామగ్రి అందించారు. 25 కిలోల వరకు అన్నం వండేలా పాత్రలు అందజేశారు.



దీబగుంట్ల హైస్కూల్‌కు మంజూరైన వంట పాత్రలు

పాత్రల ఇబ్బందులు తప్పాయి



పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండుతున్నాం. ఎంతో కాలంగా వంటలు చేస్తున్న తమకు ఏ ప్రభుత్వం వంట పాత్రలను పూర్తిస్థాయిలో ఇవ్వలేదు. జగనన్న ఒక్కడే తమ కష్టాలను గుర్తించి వంటకు సరిపడే మంచి స్టీల్ పాత్రలను అందించారు. ప్రస్తుతం మాకు పాత్రల ఇబ్బందులు తప్పాయి.

– గోకారమ్మ, వంట నిర్వాహకురాలు శ్రీరాంనగర్

పాత్రలు నాణ్యతగా ఉన్నాయి



బడిలో వంట చేసేందుకు ఇచ్చిన స్టీల్ పాత్రలు చాలా బలంగా ఉన్నాయి. వంట పాత్రల కోసం గతంలో ఎన్నోసార్లు అధికారులను, పాలకులను అడిగిన పట్టించుకోలేదు. వంట పాత్రలు లేకపోతే సొంతంగా కొనుగోలు చేసి వంటలు చేశాం. జగన్ వచ్చాక పాత్రలు ఇచ్చి మా బాధలను తప్పించాడు

– పుల్లమ్మ, వంట నిర్వాహకురాలు గోస్పాడు

ఇప్పటికే నిర్వాహకులకు అందజేశాం



మండలంలోని 31 పాఠశాలలకు మధ్యాహ్న భోజనం వండటానికి అవసరమైన వంట పాత్రలను ప్రభుత్వం మంజూరు చేసింది. బడులను ఆరు కేటగిరీలుగా విభజించి పంపిణీ చేశారు. మంజూరైన పాత్రలను ఇప్పటికే పాఠశాలలకు అందజేశాం . పాత్రలు చాలా నాణ్యతగా ఉన్నాయి. భద్రంగా ఉంచుకోవాలని వంట నిర్వాహకులకు సూచించాం .

– అబ్దుల్‌కరీం, ఎంఈఓ, గోస్పాడు

ట్యాబ్‌లపై అవగాహన



మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): స్థానిక డిప్యూటీ ఈఓ కార్యాలయంలో సహిత విద్య ఉపాధ్యాయులు, ఐఈడీ ఎస్ఎస్‌స్కూల్ అసిస్టెంట్లు, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ట్యాబ్‌లపై డీఈఓ సుధాకర్ రెడ్డి, అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఏపీ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన 233 ట్యాబ్‌లను దివ్యాంగ విద్యార్థులు, సహిత విద్య, ప్రత్యేక ఉపాధ్యాయులకు అందజేశామన్నారు. ట్యాబ్‌లను ఎలా ఉపయోగించాలి, ప్రత్యేక అవసరాలకు గల పిల్లలకు ఎలా బోధన చేయాలి అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ట్యాబ్‌లో 33 రకాల యాప్‌లు ఉన్నాయని, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వాటి ద్వారా ఎలా బోధన చేయాలో వివరించారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ సునిల్ కుమార్, లక్ష్మీనాయుడు, రాష్ట్ర పరిశీలకులు నరసింహులు హాజరయ్యారు. సహిత విద్య కో ఆర్డినేటర్ రఘురామిరెడ్డి, శ్రీనివాసులు, ఎంఈఓ బ్రహ్మం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

నంద్యాల(వ్యవసాయం): హత్యాయత్నం, దాడి కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానాను సెకండ్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కిరణ్‌కుమార్ తీర్పును ఖరారు చేసినట్లు పోలీసు సిబ్బంది సోమవారం తెలిపారు. వివరాలు.. 2019లో బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన నిందితుడు వేల్పుల గోవర్ధన్ అదే గ్రామానికి చెందిన మహిళ ఇంట్లోకి భర్తలేని సమయంలో వెళ్లి బలత్కారం చేయబోవడంతో పాటు సహకరించకపోతే చంపుతానని వైరుతో గొంతు బిగించాడని నాడు నందివర్గం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఐదు సంవత్సరాల కారాగార శిక్ష, రూ.3,500 జరిమానా విధించినట్లు వివరించారు.

వాడీవేడిగా సర్వ సభ్యసమావేశం

- సమస్యలపై నిలదీసిన సభ్యులు
- నీళ్లు నమిలిన అధికారులు



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పలుమార్లు ప్రస్తావించిన అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తెచ్చారు. పలువురు ప్రస్తావించిన సమస్యలపై సమాధానం ఇవ్వలేక అధికారులు నీళ్లు నమిలారు. ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముందుగా అజెండా ప్రకారం ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు ఆయా శాఖల ప్రగతి నివేదికలను వెల్లడించాలని కోరారు. మండలంలోనున్న 56 చేతి బోర్లు సక్రమంగా పనిచేస్తున్నాయని, ఉయ్యాలవాడ, రూపనగుడి, పెద్దయమ్మనూరు గ్రామాల్లో జలజీవన్ మిషన్ కింద పనులు ప్రారంభమయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీకృష్ణ తెలిపారు. వెంటనే ఎంపీపీ స్పందిస్తూ మండల కేంద్రంలోనే నీటి సమస్య తీవ్రంగా ఉందని, తన ఇంటికే కుందూనది నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుని వాడుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇక మండలంలో మీరు ఏమాత్రం పని చేస్తున్నారో అర్థం పడుతుందని అసహనం వ్యక్తం చేశారు. ఈఓపీఆర్‌డీ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ఇటీవల విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే పాలు, గుడ్లు చెడిపోయి వస్తున్నాయని అల్లూరు గ్రామ సర్పంచ్ మాదర క్రిష్ణవేణి సభ దృష్టికి తెచ్చారు. ఎంపీడీఓ రఘురాం మాట్లాడుతూ కేంద్రాలకు ఏజెన్సీ నిర్వహకులు సరఫరా చేసే సమయంలో పాల ప్యాకెట్లపై తేదీ ఉంటుందని కాలం దాటిపోయిన వాటిని వెంటనే వెనక్కు పంపేలా కార్యకర్తలకు సూచించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. తహసీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఓటర్ల జాబితాను ప్రచురించామన్నారు. మండలంలో 22,678 మంది ఓటర్లున్నారు. కొత్తగా ఓటరు నమోదు కోసం 438 దరఖాస్తులు వచ్చాయని, తొలగింపులు, పేర్ల మార్పు వంటి పరిశీలన కార్యక్రమం చేపట్టామన్నారు. మండలంలో 609 మందికి గాను 405 ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేశామన్నారు. వైద్యాధికారులు వెంకటసుబ్బయ్య, విజయ దుర్గ, రాబర్ట్ కెనడీ, ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సత్తిగారి బాలిరెడ్డి, గగ్గెర వెంకటేశ్వర్లు, పెద్ద పేరయ్య, మండల కోఆప్షన్ మెంబర్ అమీర్ అహమ్మద్, సర్పంచ్‌లు మేకల ఓబులేస్, పల్లె గురు ప్రసాద్‌రెడ్డి, రామమద్దిలేటిరెడ్డి, ప్రసాద్, నడిపెన్న పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

నంద్యాల: పట్టణంలోని 2వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు కరీముల్లా, జాకీర్, ఇసాక్‌తో పాటు 30 కుటుంబాలు మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మాజీ మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ విజయానికి కృషి చేయాలని వారికి సూచించారు. కౌన్సిలర్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.



శిల్పా మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



వృద్ధురాలితో మాట్లాడుతున్న గంగుల అవంతిరెడ్డి

ఆళ్లగడ్డ: ప్రజలందరికీ మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు గంగుల అవంతిరెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని ఆచారి కాలనీలో రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే జగనన్నను మరో సారి ఎన్నుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, న్యాయవాది సరిత, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వరలక్ష్మి ఉన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



భక్తజనసందోహం మధ్య రథోత్సవం

మిడుతూరు: రోళ్లపాడు అభయరణ్యంలో వెలసిన శ్రీ బరక సంజీవరాయ స్వామి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, కలశ పూజ, మన్యసూక్తహోమం, తదితర విశేష పూజాధిత కార్యక్రమాలను పండితులు నరహరి శర్మ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది.

రమణీయం .. రథోత్సవం

స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆసీనులు గావించి రథం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం రథంపై అధిష్ఠింపజేసి విశేష పూజల అనంతరం భక్తజనుల జయ జయ ధ్వానాల మధ్య రథోత్సవం సాగింది.

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

రాష్ట్ర స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలను ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్‌లు ప్రారంభించారు. ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళీ మోహన్ రెడ్డి, గ్రామపెద్దలు పేరెడ్డి రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్, మండల ఏపీఎస్ కన్వీనర్ రవికుమార్, కల్యాణ మండపం చైర్మన్ పాలగ్గారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వామికి ప్రత్యేక పూజలు

బరక సంజీవరాయ స్వామికి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్, సర్పంచ్ పేరెడ్డి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి, ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు

మండల సర్వసభ్య సమావేశం

గోస్పాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ ఆర్థర్‌సైమాన్ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అనసూయ సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ సమావేశానికి మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

గోస్పాడు: మండలంలోని రాయపాడు గ్రామంలో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయం, నీటి సరఫరా పంపులను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి మంగళవారం ప్రారంభిస్తారని ఎంపీడీఓ అనసూయ సోమవారం తెలిపారు. ప్రభుత్వం రూ.50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తవడంతో కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గ్రామ, వార్డు వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేసి సన్మానిస్తారని చెప్పారు.

వలంటీర్లకు వందనం..

రుద్రవరం: మండలంలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులు అందజేస్తుంది. ఇందుకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం వలంటీర్లకు పురస్కారాలు అందజేసి సన్మానించనున్నామని ఇందుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ రామచంద్ర సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో 242 మంది వలంటీర్లు ఉన్నారు. వారిలో సేవా మిత్రకు 208 మంది, సేవారత్నకు ఐదుగురు ఎంపికయ్యారని చెప్పారు.

వంతెన నిర్మాణానికి భూమి పూజ..

రుద్రవరం: మండలంలోని చందలూరు,చిలుకలూరు,ఎర్రగుడిదిన్నె,పేరూరు మీదుగా శిరివెళ్ల వరకు నూతనంగా తారు రోడ్డు వేశారు. అయితే పేరూరు నుంచి శిరివెళ్లకు చేరుకునేందుకు మధ్యలో వక్కిలేరు వాగు ఉంది. ఆ వాగు దాటేందుకు ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.8.93 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణ పనులనుఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మంగళవారం భూమి పూజ చేసి ప్రారంభిస్తారని సర్పంచు కోనేటి దేవ దానం, ఎంపీటీసీ వసంతమ్మ, నాయకులు తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

శిరివెళ్ల: ఈ నెల 20వ తేదీన మండల కేంద్రానికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి రానున్నారని ఎంపీడీఓ ఫణి రాజకుమారి సోమవారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండలంలోని గ్రామ వలంటీర్లకు సన్మానం, పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నామని, ఇందుకు ఎమ్మెల్యే పాల్గొంటారని చెప్పారు.

తుది దశకు కులగణన సర్వే

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలో జరుగుతున్న కులగణన సర్వే తుది దశకు చేరుకుందని డీఎల్‌డీఓ మురళీకల్యాణి సోమవారం తెలిపారు. 5,50,393 గృహాలకు సంబంధించిన 15,58,156 మందికి కులగణన పూర్తయ్యిందని, దీంతో ఇప్పటి వరకు 92.27 శాతం సర్వే చేసినట్లు చెప్పారు. వంద శాతం పూర్తి కావడానికి ప్రజలు సహకరించాలని కోరారు.



వైఎస్సార్ నగర్‌లో ఉర్దూ పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

అభివృద్ధికి చిరునామాగా నంద్యాల

నంద్యాల(సిటీ): నాలుగున్నరేళ్లలో పట్టణ రూపురేఖలు మారిపోయాయని, అభివృద్ధికి చిరునామాగా మార్చామని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో రూ.1.91కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.1.17 కోట్లతో రైతునగర్‌లో పైప్‌లైన్, సచివాలయ ప్రహరీ, ఆర్టీసీ కాలనీలో వాటర్ పైప్‌లైన్ నిర్మాణాలు, రూ.36 లక్షలతో వైఎస్సార్ నగర్‌లో ఉర్దూ పాఠశాల భవనం, రూ.35 లక్షలతో శిల్పా నగర్‌లో సీసీ డ్రైన్లను నిర్మించారు. వాటిని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, కౌన్సిలర్లు చంద్రశేఖర్‌రెడ్డి, తూర్పునాటి సావిత్రమ్మ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ రమణతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల పట్టణాన్ని గతానికి భిన్నంగా అభివృద్ధి చేస్తుంటే టీడీపీ నాయకులకు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. వారు వెంటనే ఏదైనా కంటి వైద్యశాలలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. కోట్లాది రూపాయలతో నంద్యాల రూపురేఖలు మారుస్తుండటం ప్రజలందరికీ కనిపిస్తున్నా.. వారికి కనిపించడం లేదంటే నేత్ర సమస్య ఉన్నట్లేనంటూ చురకలంటించారు. మహాత్మా గాంధీ చెడు చూడకు, చెడు వినకు, చెడు మాట్లాడకు అంటే.. టీడీపీ నాయకులు మాత్రం.. అభివృద్ధి చూడం, అభివృద్ధి గురించి వినం, అభివృద్ధి గురించి మాట్లాడం అంటున్నారని, దీన్ని బట్టి చూస్తే వారు ఎంత పక్షపాత ధోరణి, విషం చిమ్ముతున్నారో అర్థం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఇంత అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్‌సీపీని మరోమారు ఆదరించాలని కోరారు. రైతునగర్ నాయకుడు రామసుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, మణిమోహన్‌రెడ్డి, రాజు, రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌పీ కృష్ణారెడ్డి, రమేష్, మల్లికార్జున రెడ్డి, వైఎస్సార్ నగర్ నాయకులు నరసింహారావు, అంకాలయ్య, అన్వర్‌బాషా, వెంకటస్వామి శెట్టి, జాకీర్ హుసేన్, తిరుపతయ్య, రామకృష్ణారెడ్డి, గోరెముర్తుజా పాల్గొన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ సేవలు

దొర్నిపాడు: మండలంలోని గ్రామ సచివాలయాల్లో మంగళవారం నుంచి మొబైల్ ఆధార్ సేవలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 20వ తేదీన దొర్నిపాడు, 22న బుర్రారెడ్డిపల్లె, 23 చాకరాజువేముల సచివాలయాల పరిధిలో ఆధార్ సేవలు అందజేస్తారన్నారు. డిజిటల్ అసిస్టెంట్ నాగేశ్వరరావు ఆధార్ కార్డులో సవరణలు చేస్తారని పేర్కొన్నారు. స్థానికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నంద్యాల(అర్బన్): మండలంలోని బిల్లలాపురం, పాండురంగాపురం, కొత్తపల్లి, పుసులూరు గ్రామాల్లో మంగళవారం నుంచి నిర్వహించే ఆధార్ స్పెషల్ క్యాంపును ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సౌభాగ్యమ్మ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. మంగళ, బుధవారం బిల్లలాపురం, పాండురంగాపురం గ్రామాల్లో, గురు, శుక్రవారాల్లో కొత్తపల్లె, పుసులూరు గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేస్తామని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, హెచ్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సహకరించాలని సూచించారు.

భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవం



చాగలమర్రిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న మాలధారులు

చాగలమర్రి: మండల కేంద్రంలో సోమవారం రాత్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక శ్రీచెన్నకేశవ స్వామి ఆలయం నుంచి పాత బస్టాండు, మెయిన్ బజార్, చిన్నమకానం, పెద్ద మకానం మీదుగా తిరిగి మెయిన్ బజారు నుండి ఆలయం వరకు ఊరేగింపు సాగింది. 41 రోజుల పాటు శ్రీలక్ష్మీనరసింహస్వామి మాల ధరించిన 50 మంది భక్తులు 34వ రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి చిత్రటాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం భక్తులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండయ్య, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గుత్తి నరసింహులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

వెలుగోడు: ఆయిల్ పామ్ సాగుతో రైతులకు లాభాలు వస్తాయని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో మండల రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగులో యాజమాన్యం పద్ధతుల గురించి వివరించారు.